క్లుప్తంగా

రేపటి నుంచి వైద్యశిబిరాలు

మహాముత్తారం: మేడారం మహాజాతరను పురస్కరించుకొని మండలంలో మూడు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యామన్‌పల్లి, పెగడపల్లి, సింగారం గ్రామాల్లో ఈ శిబిరాలు ఈ నెల 21 నుంచి 24 వరకు ఉంటాయని తెలిపారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

మహాముత్తారం: మేడారం మహాజాతరను పురస్కరించుకొని భక్తుల సౌకర్యం కోసం కాటారం సబ్ డివిజన్‌లోని కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, మండలాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, నిమ్మగూడెం,పెగడపల్లి, బోర్లగూడెం, రేగులగూడెం, సింగారం నుండి కాల్వపల్లి వరకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆరుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్సైలతో పాటు 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి నుంచి జాతర ముగిసేవరకు విధుల్లో ఉంటారని తెలిపారు. జంక్షన్ల వద్ద, మూలమలుపులు, కల్వర్టులు, పార్కింగ్‌ల వద్ద విధులు నిర్వహిస్తారని తెలిపారు.

విద్యార్థికి సన్మానం



మహాముత్తారం: మండలంలోని డొబ్బలపాడ్ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎడ్ల సంపత్ జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. సంపత్‌ను కళాశాలలో పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, పావని, జోజి, రాంబాబు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలి

మహాముత్తారం: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా విద్యావేత్త గోమాస సచిన్‌ను ప్రకటించాలని నేతకాని రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి రాజబాపు నేత అన్నారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ సచిన్ కరోనా సమయంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత సేవచేసి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలం వజినపల్లి, నేరేడుపల్లికి గ్రామాలకు చెందిన బాణాల రాజు, సల్వాల శ్రీనివాస్‌లు అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గర్మిళ్లపల్లిలో పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండల కేంద్రంలో ఎల్‌అండ్‌టీ రోడ్డులో గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మేడిగడ్డ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డులో అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

భూపాలపల్లి రూరల్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పెద్దాపూర్‌లో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన మాడుగుల ప్రదీప్ (35) పదిరోజుల క్రితం మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు హనుమకొండలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

లింగాలలో వివాహిత..

రేగొండ: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి అత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని లింగాలలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన హిమబిందు(25)కి ఎనిమిది నెలల క్రితం మండలంలోని లింగాలకు చెందిన మొర్రి హరీష్‌తో వివాహం జరిగింది. ఈ క్రమంలో హిమబిందు కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక జనవరి 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి సుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

దుబ్బ తీర్థానికి సర్వం సిద్ధం

మల్హర్: మండలంలోని చిన్నతూండ్లలోని దుబ్బపేటలో నిర్వహించే దుబ్బ తీర్థం (సమ్మక్క-సారలమ్మ) జాతరకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. కొన్నేళ్లుగా అత్యంత వైభవంగా దుబ్బ తీర్థంను నిర్వహిస్తున్నారు. ఈనెల 21(బుధవారం), ఈనెల 22 (గురువారం) రెండు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు మండలంలోని ఆయా గ్రామాల నుంచే కాకుండా కాటారం, ముత్తారం, మహాముత్తారం, మహదేవపూర్, గోదావరిఖని, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని పూజలు చేస్తారు. జాతరను చిన్నతూండ్ల పరిధిలోని దుబ్బపేట ప్రాంతంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. బుధవారం సారలమ్మకు రెండు, మూడు గంటల పాటు పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు. పూజల అనంతరం అమ్మవారి ప్రతిరూపాలైన పూజ కుండలను అమ్మవారి పూనకం వచ్చే శివసత్తి అధారంగా డప్పు చప్పుళ్లతో గద్దెలకు చేర్చుతారు. అలాగే గురువారం సమ్మక్కను గద్దెలకు చేర్చి తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఐదు బోనాలను తయారు చేసి వాటిని ఎత్తుకొని డప్పుచప్పులు,



జాతరకు ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ గద్దెలు

శివసత్తుల పూనకాలతో గుడి చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. అనంతరం పట్నాలు వేసి పూజలు నిర్వహించి జాతరను ముగిస్తారు. ఈ ప్రాంతం దుబ్బతో నిండి ఉండడం వల్ల దుబ్బ తీర్థంగా పేరుగాచ్చినట్లు కమిటీ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఏర్పాట్లు చేశాం..



తాతల కాలం నుంచి కోట వారి ఆధ్వర్యంలో రెండు సంవత్సరాలకు ఒకసారి దుబ్బతీర్థం జాతర నిర్వహిస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు ఏర్పాట్లు చేశాం.

- కోట లక్ష్మయ్య, ఆలయ కమిటీ చైర్మన్

తహసీల్దార్ ఎదుట బైండోవర్

పలిమెల: అటవీ జంతువుల వేటకు విద్యుత్ తీగలను అమర్చిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని సోమవారం తహసీల్దార్ హేమ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. అటవీ జంతువులను వేటాడడానికి, పంట పొలాల రక్షణ కోసం విద్యుత్ తీగలను అమర్చొద్దని హెచ్చరించారు. ఎవరైనా ఈ విధంగా చేస్తే వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ప్రమాదం జరిగిన ఆ ప్రమాదానికి కారణమైన వారిపై రౌడీ షీట్‌తో పాటు, హత్యా నేరం కూడా నమోదు చేస్తామన్నారు.

ఇద్దరి బైండోవర్

మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సారయ్య, పెగడపల్లికి చెందిన కొర్ర వీరపాల్‌లను రూ.లక్ష పూచీకత్తుపై తహసీల్దార్ హేమ ముందు సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు.



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల పక్కా సమాచారం మేరకు సారయ్య ఇంటి వద్ద సోదా చేయగా ఆయనను, ఇతనికి గుడుంబా సరఫరా చేస్తున్న పెగడపల్లికి చెందిన వీర్ పాల్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబాను అమ్మినా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

కాటారం: మండలంలోని విలాసాగర్‌లో ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 393 క్యూబిక్ మీటర్ల ఇసుకను తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. శ్రీనివాస్ ఇసుక వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.600 చొప్పున మొత్తం రూ.2,35,800 ఇసుక వేలం ద్వారా వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం నగదును మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

పాత పద్ధతిలోనే జాతర కమిటీ నిర్వహణ

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్య జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవ కమిటీలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించారు. పాత పద్ధతిలోనే కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో ముల్కలపల్లికి చెందిన చదువు అన్నారెడ్డిని జాతర కమిటీ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అన్నారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా జాతరను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

భక్తులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

చిట్యాల: మేడారం జాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఎన్నడూ లేనంతగా సదుపాయాలను కల్పించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వనదేవతలను దర్శించుకోవడానికి కొట్లాది మంది భక్తులు వస్తారని అందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే రూ.కోట్లాది నిధులను మంజూరు చేసి అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే చిట్యాల మండలంలోని వెంచరామి శివారులోని పురేడు గుట్ట వద్ద, మొగుళ్లపల్లిలోని చలివాగు వద్ద, రేగొండ మండలంలోని తిర్మలగిరి శివారులో, గుర్రంపేట శివారులో సమ్మక్క సారలమ్మ జాతరలు నిర్వహించడం జరు



మాట్లాడుతున్న మధువంశీకృష్ణ

గుతుందన్నారు. ఈ జాతరలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషితో అనేక నిధులు కేటాయించి జాతరల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మన్ గౌడ్, చిలుకల రాయకొమురు, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేగు చెట్టుకు కల్లు



కాటారం: ఈత, తాటి చెట్లకు కల్లు పారడం సహజం.. కానీ రేగు చెట్టుకు తెల్లకల్లు పారుతున్న వింత సంఘటన కాటారం మండల కేంద్రం గారెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గారెపల్లి హమాలీవాడకు చెందిన మహమ్మద్ సలీం ఇంటి ఆవరణలో మూడేళ్ల క్రితం రేగు మొక్కను నాటాడు. ఇప్పుడు అది ఎదిగి ఐదు రోజులుగా కల్లు కిందకు పారుతోంది. గమనించిన సలీం చెట్టుకు ఓ బాటిల్‌ను అమర్చగా కల్లు ఉబికి వస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. రేగు చెట్టు నుంచి వస్తున్న కల్లు అచ్చం తాటికల్లులా ఉందని తాగిన వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సంజీవ్‌రావును సాక్షి అడగగా ప్రతి చెట్టులో కణద్రవం ఇమిడి ఉంటుందని తెలిపారు. చెట్టుకు గీత పెట్టినప్పుడు కణద్రవం బయటకు వస్తుందని చెట్టు జాతిని అనుసరించి ఒక్కో రంగులో ఇలా ద్రవం బయటకు రావడం జరుగుతోందని తెలిపారు. కానీ రేగు చెట్టు నుంచి వచ్చే ద్రవపదార్థం తాటి కల్లు రుచి ఉండదని వివరించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిట్యాల: మండలంలోని ఒడితల శ్రీ వి వేకానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులను నిర్వర్తించారు. డీఈఓగా ఎ. ప్రణీత్, ఎంఈఓగా తేజస్విని, ప్రధానోపాధ్యాయుడిగా జి.స్ఫూర్తి, వ్యవహరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు గొళ్ల సతీష్, ఉయ్యాల శ్రీధర్ పాల్గొన్నారు.

'తప్పుడు ప్రకటనలు మానుకోవాలి'

చిట్యాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కోడిగుడ్లను కిరాణ షాపులలో అమ్ముతున్నారని ఏబీవీపీ నాయకుడు రాజ్‌కుమార్ ఇచ్చిన తప్పుడు ప్రకటనలలో ఏలాంటి వాస్తవం లేదని అలాంటి ప్రకటనలను మానుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతల సంధ్యారాణి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఏలాంటి ఆధారాలు లేకుండా కావాలని తమపై అవమాన పరిచే విధంగా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. విచారణకు వచ్చిన అధికారులకు రాజ్‌కుమార్ ఏలాంటి ఆధారాలు చూపలేదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కరుణ, ఉమ, భాగ్యలక్ష్మి, జ్యోతి, భాగమ్మ, సుజాత, రాజేశ్వరీ, వెంకటరమణ, అరుణ, శారద, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన సరిగొమ్ముల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడితో పాటు చదువుకున్న 2008 బ్యాచ్‌కి చెందిన తోటి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబానికి రూ.27 వేలు ఆర్థిక సాయం అందించారు. మాదాసు దేవేందర్, పిట్టల అనిల్, సిల్వేరు రాఘవ, రాగం రాజేందర్, సూత్రపు శివాజీ, రాజు, శ్రీను, నవీన్ కుమార్, రమేష్ , ప్రదీప్ తదితరులు ఉన్నారు.

పంపు ఆపరేటర్‌కు..

మండలంలోని వరికోల్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పంపు ఆపరేటర్ రాజారపు భాస్కర్‌కు విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు కాలికి దెబ్బతగిలింది. దీంతో అతడు నడవలేనిస్థితిలో ఉన్నాడు. విషయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

తెలుసుకున్న మండల గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం సిబ్బంది రాజారపు భాస్కర్‌ను పరామర్శించి రూ. 2 వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో కారోబార్లు కంచర్ల శంకర్, ఎలగొండ శేఖర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పీవీఎస్.భవానిసేన్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కిరాణ వర్తక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ సత్తమ్మ, డీసీసీ ప్రధానకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు జానీ, మాజీ వార్డుసభ్యురాలు కవిత, సారయ్య, నాయకులు శకీల్, రాజబాపు, హైదర్, బాబా, సంతోష్, రాజశేఖర్,కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు గందెసిరి మధుసూదన్, కోశాధికారి రేణికుంట్ల శ్రీనివాస్, వి. వెంకట్‌రెడ్డి, కిరణ్, మహేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఇమ్రాన్ ఉన్నారు.

వ్యక్తి అరెస్ట్

కాటారం: మండలంలోని మేడిపల్లిలో విద్యుత్ తీగలతో ఓ వ్యక్తి మృతికి సంబంధించిన కేసులో నిందితుడైన అప్పాల భూమేశ్ గడువులోపు కోర్టుకు హాజరుకాకపోవడంతో జడ్జి వారెంట్ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అభినవ్ సోమవారం తెలిపారు. 2019లో మేడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బస్వాపూర్‌కు చెందిన వెన్నపురెడ్డి రాజయ్య పలువురు నేరస్తులు వేసిన కరెంట్ తీగలకు షాక్ గురై మృతి చెందాడు. ఈ కేసు భూపాలపల్లి కోర్టులో విచారణ జరుగుతుండగా ఇట్టి కేసులో ఏ4 నిందితుడు అయిన అప్పాల భూమేశ్ సంబంధిత కోర్టుకు సరిగా హాజరు కాలేదు. దీంతో సదరు కోర్టు ఎన్‌బీడబ్ల్యూ(నాన్ బెయిలెబుల్ వారెంట్) జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు భూమేశ్‌ను కోర్టులో హాజరుపర్చి పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చిట్యాల: శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకటేష్ గౌడ్



మొగుళ్లపల్లి: శివాజీ జయంతి వేడుకలు



ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

చిట్యాల: మండల కేంద్రంలో బీజేపీ, ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాజీ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, అరెకుల సంఘం మండల అధ్యక్షుడు లాండే సాంబశివరావు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ సురేష్, గజనాల రవీందర్, శ్రీనివాస్, రాజేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి: మండల కేంద్రంతో పాటు గుండ్లకర్తి, కొర్కిశాల, గణేష్‌పల్లి గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను సోమవారం ఆరె కులస్తులు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆరె కులస్తులు మాట్లాడుతూ శివాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరె కులసంఘం నాయకులు మోటె ధర్మారావు, జమలాపురం లక్ష్మణ్‌రావు, కరాబు మలహల్‌రావు, జనార్ధన్, చందర్‌రావు, యుగేందర్, రామారావు, యువరాజు శివాజీ, రాజలింగం, నేతాజీ, మహిపాల్, శ్రీధర్, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

టేకుమట్ల: గత సంవత్సరం మండల కేంద్రంలో పునఃప్రతిష్ఠాపన చేసిన బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్ఛరణల మధ్య హోమ కార్యక్రమాన్ని ప్రధానార్చకుడు మల్లికార్జున్, పురోహితుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించి బొడ్రాయి విగ్రహ దేవతామూర్తులకు జలాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో గల పోషమ్మ దేవాలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పొలాల సరోత్తంరెడ్డి, ఎంపీటీసీ ఆది రఘు, మాజీ ఉప సర్పంచ్ నిమ్మల స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు



వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు

రేనుకుంట్ల శ్రీధర్, భూస వెంకటేష్, దూడం రాజు, దాసరి రాజయ్య, కుమారస్వామి, సంపత్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



కాటారం: బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎనిమిదవ తరగతి విభాగంలో చింతకాని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శివమణి, తొమ్మిదవ తరగతి విభాగంలో మాంటిస్సోరి పాఠశాలకు చెందిన కె.శివాణి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను కాటారం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శ్రీనివాస్, సుధాకర్, కుమారస్వామి, నలిని, రమణారెడ్డి, కోమల్, హరీష్ పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలకు చెందిన జంబుల సౌమిత్ (8వ తరగతి) విద్యార్థి మండల స్థాయిసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానంలో నిలిచినట్లు సోమవారం ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు రాధిక రాణి, ఉమాదేవి, మమత, రంజిత్ కుమార్, స్వరూప, రూపశ్రీ, ఎండీ.రఫీ, మాధవి, చారి, సాంబరాజు అభినందించారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్, బొమ్మాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు నోడల్ అధికారి శంకరయ్య సోమవారం తెలిపారు. సైన్స్ పోటీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్ మొదటి బహుమతి, రెండవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూరారం విద్యార్థి అభినేష్ ,విఘ్నేష్ సమయుక్తంగా సాధించారు. క్విజ్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహదేవపూర్ విద్యార్థులు ప్రథమ స్థానం, అంబట్‌పల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

కాటారం: మేడారం వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలో మేడారం భక్తుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ సేవలను సోమవారం ఎంపీపీ ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణం సురక్షితం అని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణికులు మేడారం చేరుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం లక్ష్మీరాజం, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ సేవలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సమ్మయ్య

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: మండలంలోని వెంచరామి, కుర్మపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలను, నాయకులను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



రాజమోహన్, అధ్యక్షుడు

కాటారం: తెలంగాణ పీఆర్టీయూ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాములు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నూతన కమిటీ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా శనిగరపు రాజమోహన్, ప్రధాన కార్యదర్శిగా పరమేశ్వర్, ఉపాధ్యక్షులుగా సుమన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు, డీఏలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.